నేటి నుంచి ఆలయ బ్రహ్మోత్సవాలు

నిజాంపేట్: నిజాంపేట్ ఇందిరమ్మ కాలనీ, ఫేజ్ 2, 12వ డివిజన్‌లోని పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు, లక్ష్మీగణపతి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నుంచి 12వ తేదీ వరకు అత్యంత వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం 8:30 గంటలకు గోపూజ, గణపతిపూజ, పుణ్యాహవాచనం, మాతృకపూజ, ప్రాశనం, రక్షాబంధనం, ఋత్విక్ వరుణం, దీక్షాధారణం, యాగశాల షోడశస్తంభపూజ, లక్ష్మీగణపతి హోమం, తీర్థప్రసాద వితరణం జరుగుతుందన్నారు. శనివారం ఉదయం 5 గంటలకు శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి అభిషేకం, సహస్ర నామార్చన, 108 సార్లు మన్యుసూక్త పారాయణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం 5:30గంటలకు మూల మంత్ర హోమాలు, 6:55 గంటలకు లక్ష్మీ గణపతి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తారు. సోమవారం ఉదయం 6:30 గంటల నుంచి శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి విశేష పూజలు, ఆవాహిత హోమం, లక్ష తమలపాకుల పూజ నిర్వహిస్తారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



చెక్కులు అందజేస్తున్న కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. గాజులరామారంలోని పార్టీ కార్యాలయంలో చౌదరిగారి కృష్ణవేణికి రూ.49 వేలు, వెలుగలా పుష్పమ్మ, ఈరప్ప పంచల్, పల్లపు రేణుకలకు రూ.60 వేల చొప్పున మంజూరైన చెక్కులను అందజేశారు. అనంతరం నియోజకవర్గ ప్రజలను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

'ప్రజా తిరంగ్ యాత్ర' పోస్టర్ ఆవిష్కరణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: భద్రాచలం నుంచి హైద్రాబాద్ వరకు ప్రజా తిరంగ్ యాత్రకు ఈనెల 26న నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా యాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను సామాజిక తెలంగాణ పార్టీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు అమానగంటి సైదులు గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద ఆవిష్కరించారు. అనంతరం సైదులు మాట్లాడుతూ... అటూ తెలంగాణ ప్రజల పక్షాన.. ఇటు ప్రభుత్వం పక్షాన.. రాష్ట్ర అభివృద్ధిని కోరుతూ జరిగే యాత్రకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలోని సమస్యలు తెలుసుకుంటూ ఉపాధి విద్య, ఉద్యోగం, రాజ్యాధికారం దిశగా ప్రజలను చైతన్యం చేస్తూ ఈ యాత్ర భద్రాచలం నుంచి సూర్యాపేట, జనగాం, భువనగిరి, ఘట్‌కేసర్, ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద యాత్ర ముగుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజాఫ్రంట్ నాయకులు కడమంచి రాంబాబు, సినిమా డైరెక్టర్ శ్రీపాద రామచంద్రరావు, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతలేని విత్తనాలు తయారు చేస్తే కఠిన చర్యలు

మేడ్చల్ జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ

శామీర్‌పేట్: నాణ్యత లేని విత్తనాలు తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవని మేడ్చల్ జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ హెచ్చరించారు. గురువారం తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని దేవర యాంజాల్‌లో విత్తన కంపెనీలను ఆకస్మికంగా ఆమె తనిఖీ చేశారు. డెన్మార్క్ సీడ్స్, సిరిసీడ్స్, యూనివేజ్ మహికో, బ్రహ్మపుత్ర సీడ్స్, కోరమండల్ కంపెనీలను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ మాట్లాడుతూ.. ప్రతి కంపెనీలో నాణ్యమైన విత్తనాలు మాత్రమే తయారు చేయాలని, స్టాక్ బోర్డులు, స్టాక్ రిజిష్టర్లు ఏర్పాటు చేయాలన్నారు. నాణ్యత లేని విత్తనాలను తయారు చేస్తే విత్తన చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తన ధ్రువీకరణ ఏడీ శివకుమార్, మండల వ్యవసాయాధికారి రమేష్, ఎస్‌ఓటీ ఎస్సై రోహిత్ పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

• వేసవి శిక్షణా శిబిరాలకు విశేష స్పందన • నియోజకవర్గంలో ఆరు పాఠశాలలు ఎంపిక • వాలంటీర్లతో విద్యార్థులకు శిక్షణ



డ్రాయింగ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థి



ఫిజికల్ ఫిట్‌నెస్ కోసం వ్యాయామం చేస్తున్న విద్యార్థులు

రంగారెడ్డినగర్: వేసవి కాలం వచ్చిందంటే శిక్షణ శిబిరాలకు ఉండే డిమాండ్‌ను చెప్పనక్కర్లేదు. ఏ శిబిరంలో చూసినా ఆయా క్రీడలు, రంగాల్లో శిక్షణ పొందేందుకు పెద్ద సంఖ్యలో పిల్లలు క్యూ కడుతుంటారు. అయితే ఆర్థికంగా అంతంత మాత్రంగా ఉంటున్న చిన్నారులు ఈ శిక్షణా శిబిరాలకు దూరమవుతున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా మొదటిసారిగా ప్రభుత్వ పాఠశాలల్లో వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభమమై అవి విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఈ శిబిరాలను విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు, వారికి కొత్త అంశాలపై పరిజ్ఞానాన్ని పెంపొందించే విధంగా రూపొందించారు. ఈ నెల 1వ తేదిన ప్రారంభమైన శిబిరాలు 15వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ శిక్షణ శిబిరానికి హాజరయ్యే ఒక్కో విద్యార్థికి రాష్ట్ర ప్రభుత్వం రూ.100 చొప్పున వెచ్చిస్తోంది. ఈ శిబిరాల్లో ప్రాథమిక పాఠశాల నుంచి ఉన్నత పాఠశాల వరకు విద్యార్థులు పాల్గొనేలా ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తున్నారు.

నియోజకవర్గంలో ఆరు పాఠశాలలు..

◆ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని కుత్బుల్లాపూర్ మండలంలో నెహ్రూనగర్‌లోని జడ్పీహెచ్‌ఎస్, జీడిమెట్ల గ్రామంలోని జడ్పీహెచ్‌ఎస్, దుండిగల్ మండలంలోని దుండిగల్ జడ్పీహెచ్‌ఎస్, భౌరంపేట్ జడ్పీహెచ్‌ఎస్, బాచుపల్లి మండలంలోని ప్రగతినగర్ జడ్పీహెచ్‌ఎస్, నిజాంపేట్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలు ఎంపికయ్యాయి.

శిక్షణ ఇచ్చే అంశాలు ఇవే..

◆ మొన్నటి వరకు చదువుల్లో మునిగి తేలిన విద్యార్థులకు ఆట విడుపుతో పాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆయా అంశాలపై శిక్షణ అందిస్తున్నారు. ఆట పాటలతో పాటు స్పోకెన్ ఇంగ్లిష్, స్టోరీ టెల్లింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఫిజికల్ ఫిట్‌నెస్, కంప్యూటర్ స్కిల్స్, వెబ్ డిజైనింగ్, యోగా, ఇండోర్ గేమ్స్, క్రియేటీవ్ ఆర్ట్స్, డ్రాయింగ్, పెయింటింగ్, వంటి అంశాల్లో అనుభవజ్ఞులైన వాలంటీర్లతో శిక్షణ ఇప్పిస్తున్నారు. ఆయా మండలాల ఎంఈవోలు ప్రతినిత్యం శిక్షణ శిబిరాలను పర్యవేక్షిస్తున్నారు.

శిబిరాలకు విశేష స్పందన



ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన వేసవి శిక్షణ శిబిరాలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. నెహ్రూనగర్, జీడిమెట్ల గ్రామాల్లోని జడ్పీహెచ్‌ఎస్ స్కూళ్లలో 85 మంది విద్యార్థులు శిబిరాలకు హాజరవుతున్నారు. ప్రతి రోజు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిక్షణ ఇస్తున్నాం. వేసవిలో సమయాన్ని వృథా చేయకుండా చదువుతో పాటు ఆట, పాటల్లో శిక్షణ పొందేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– జెమిని కుమారి, ఎంఈవో కుత్బుల్లాపూర్

దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదం



మూసాపేట: దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదపడతాయని బాలానగర్ జోన్ డీసీపీ సురేష్ అన్నారు. కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పక్కన పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో సత్యవేద ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థలు, ఎన్‌జీవోల సహాయంతో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్‌రావు, సీఐ రాజేష్, డీఐ వెంకటేశం, ఎస్‌ఐలు రామకృష్ణ, నాగేశ్వరరావు, నరసింహ, శ్రీనివాస్, సంస్థ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఆగని అక్రమ నిర్మాణం!



రంగారెడ్డినగర్: ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం చేపడుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు.. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి ఏపీహెచ్‌బీ కాలనీ ఆర్చ్‌కు ఆనుకుని 80 గజాల్లో స్థలంలో రెండేళ్ల క్రితం మజర్ పేరుతో షెడ్డు నిర్మించి చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు యత్నించగా.. కాలనీ అసోసియేషన్ ఫిర్యాదుతో అప్పట్లో జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు సదరు నిర్మాణాన్ని నిలిపి వేశారు. అప్పటి నుంచి పలుమార్లు నిర్మాణాన్ని చేపట్టేందుకు యత్నించినా వారి పన్నాగాలు పారలేదు. తాజాగా రెండు రోజులుగా రాత్రి వేళ షెడ్డు చుట్టూ గోడలను నిర్మిస్తూ షెటర్లను బిగిస్తున్నారు. లక్షలాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

దాడి చేసిన నిందితుల రిమాండ్

భైక్ పార్కింగ్ విషయంలో గొడవ



నిజాంపేట్: ద్విచక్ర వాహనం పార్కింగ్ కోసం జరిగిన గొడవలో ఓ వ్యక్తిపై కొంతమంది మూకుమ్మడిగా దాడి చేశారు. ఈ ఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. నిజాంపేట్ ఇందిరమ్మ కాలనీ ఫేజ్1లో నివాసముంటున్న సంతోష్ లారీ డ్రైవర్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. తన సడ్డకుడు అయిన అబ్రహం కూడా అదే కాలనీలో తన కుటుంబంతో నివాసముంటూ సెంట్రింగ్ పని చేస్తున్నాడు. సంతోష్ ఉంటున్న బ్లాక్‌లోనే బిహార్‌కు చెందిన ధీరజ్ కుమార్ 2 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నాడు. ధీరజ్ కుమార్ చుట్టాలు కూడా అదే కాలనీలో వేరే బ్లాక్‌లో నివాసం ఉంటున్నారు. ధీరజ్ కుమార్ ఇంటికి వచ్చిన చుట్టాలు వారి బైక్‌ను సంతోష్ పార్క్ చేసే స్థానంలో పార్క్ చేస్తుంటే సంతోష్ వారిని పక్కకి పెట్టమని చెప్పేవాడు. అదే విధంగా మే 6వ తేదీ రాత్రి 11:30 గంటల సమయంలో ధీరజ్ కుమార్ బంధువు బైక్ పార్క్ చేస్తుండగా అతనితో సంతోష్ తన బైక్‌ను కొంత పక్కకి పార్క్ చేయమని చెప్పి ఇంట్లోకి వెళ్లాడు. ధీరజ్ కుమార్ పాతవి మనసులో పెట్టుకొని తమ బంధువు బైక్‌ను ఎందుకు పార్క్ చేయవద్దని అన్నావని సంతోష్‌ను తిట్టడం ప్రారంభించాడు. ధీరజ్‌కుమార్ వినకుండా సంతోష్‌ను ఇష్టం వచ్చినట్లు కొట్టి, అదే కాలనీ ఉంటున్న తమ్ముడు సంతోష్ సింగ్, రామ్‌రతన్ సింగ్, అక్క కొడుకులైన రోహన్‌కుమార్ సింగ్, రోహిత్ కుమార్ సింగ్‌లను పిలిచి సంతోష్‌ను కట్టెలతో కొట్టారు. ఇంతలో రోహన్ కుమార్ సింగ్ ఒక రాడ్ తీసుకొని సంతోష్‌ని కొట్టగా.. అతని ఎడమ చేయి విరిగింది. ఈ గొడవ చూసిన సంతోష్ స్నేహితులు సునీల్, సమద్, సడ్డకుడు అబ్రహం గొడవ ఆపడానికి ప్రయత్నించగా వారిపై కూడా దాడి చేశారు. సంతోష్ సింగ్ అబ్రహం చెంప కొరికాడు. ఈ మేరకు సంతోష్ బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు ధీరజ్ కుమార్, రోహన్ కుమార్ సింగ్, రామ్‌రతన్ సింగ్, సంతోష్ సింగ్, రోహిత్ సింగ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు బాచుపల్లి సీఐ తెలిపారు.

ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ



కుత్బుల్లాపూర్: పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ గురువారం రాత్రి ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తా నుంచి ఐడీపీఎల్ వరకు జరిగిన ఈ ర్యాలీలో ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌యూఐ నాయకులు మాట్లాడుతూ.. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు గట్టి గుణపాఠం చెప్పాలన్నారు. భారత ప్రభుత్వం, సైన్యం తీసుకునే ఏ చర్యకైనా తమ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. ఉగ్ర శిబిరాలపై మరిన్ని వైమానిక దాడులు నిర్వహించి వారిని అంతం చేయాలని కేంద్రాన్ని కోరారు.

12న ప్రత్యేక పూజలు

జగద్గిరిగుట్ట: వైశాఖ పౌర్ణమి సందర్భంగా 12న జగద్గిరిగుట్ట, మగ్దూం నగర్‌లోని శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. రుద్రాభిషేకం, గణపతి, చండీ, రుద్ర హోమాలు, అన్నప్రసాద వితరణ తదితర పూజలు ఉంటాయని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

బాలుడి అదృశ్యం



మహ్మద్ అమీనుద్దీన్ (ఫైల్)

సుభాష్‌నగర్: బాలుడు అదృశ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. గాజులరామారం భవానీనగర్‌కు చెందిన నూరిద్దీన్ కుమారుడు అమీనుద్దీన్(14) ఉర్దు స్కూల్‌లో చదువుతున్నారు. కాగా ఈ నెల 6వ తేదీన వాష్ రూమ్‌కు వెళ్లొస్తానని చెప్పి వెళ్లిన బాలుడు తిరిగి రాలేదు. కుమారుడు కనిపించకపోవడంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఫలితం లేకపోయింది. బాలుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి..



సయ్యద్ వలీ(ఫైల్)

సుభాష్‌నగర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు అదృశ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. సూరారం గ్రామం వైష్ణవినగర్‌కు చెందిన సయ్యద్ వలీ(65) ఈ నెల 7న సాయంత్రం 5.30 గంటలకు ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లాడు. రాత్రైనా ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో గురువారం సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'పది' టాపర్లకు సన్మానం



మూసాపేట: పేద కుటుంబంలో జన్మించి ప్రభుత్వ పాఠశాలల్లో చదివి జిల్లా మొదటి ర్యాంక్ సాధించటం అభినందనీయమని మూడిచింతల్‌పల్లి ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం సంధ్య అన్నారు. మూసాపేటలోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి ఫలితాల్లో జిల్లా, మండల స్థాయిలో టాప్ ర్యాంకులు, 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులను గురువారం సన్మానించారు. సోషల్ వర్కర్ టీఎల్‌రెడ్డి 15 మంది విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులను వారి తల్లిదండ్రులు శ్రద్ధతో చదివిస్తే మరింత ఉన్నతస్థాయికి చేరుకుంటారని అన్నారు. విద్యార్థులు ర్యాంకులు సాధించడంలో ఉపాధ్యాయుల కృషి కూడా ఉందన్నారు. కార్యక్రమంలో కృష్ణకుమారి, శ్రీరంజన్, అరుణ, అనురాధ, మారుతిదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

20న దేశ వ్యాప్త సమ్మె : సీఐటీయూ

బాలానగర్: దేశవ్యాప్త సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ అన్నారు. గురువారం సమ్మె వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, రద్దు చేసిన 29 కార్మిక చట్టాలను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం దేశంలో అందరికీ సమాన పనికి సమాన వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కేంద్రం కార్పొరేటర్ వర్గాలకు కొమ్ము కాస్తుందన్నారు. 20న జరిగే సమ్మెలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కుమార్, గణేష్, సత్యనారాయణ రెడ్డి, బాబురావు, రహీమ్, వినేష్ గౌడ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



కుత్బుల్లాపూర్: గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 2న మధ్యాహ్నం 12 గంటలకు దూలపల్లిలోని చర్మాస్ నుంచి మైసమ్మగూడకు వెళ్లే రోడ్డులో ఓ వ్యక్తి (60) అపస్మారకస్థితిలో పడి ఉన్నాడని స్థానికులు 100కి సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పేట్ బషీరాబాద్ పోలీసులు సదరు వ్యక్తిని గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ 5న మధ్యాహ్నం మృతి చెందాడు. అతని వివరాలు తెలియకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

నిజాంపేట్: కాంట్రాక్టర్లకు కొమ్ముకాస్తూ ప్రజాధనం వృథా చేస్తున్న కార్పొరేషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నిజాంపేట్ అధ్యక్షుడు భిక్షపతి యాదవ్ కోరారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఐదు నెలల క్రితం నిజాంపేట్‌లోని బొడ్రాయి నుంచి వాటర్ ట్యాంక్ వరకి దాదాపు కోటి పది లక్షల వ్యయంతో డ్రైనేజీ పనులు ప్రారంభించారన్నారు. సదరు కాంట్రాక్టర్ బొడ్రాయి వద్ద నుంచి బండారి లేఅవుట్ సమీపం వరకు తవ్వకాలు జరిపి పైప్‌లైన్ కూడా వేశారని తెలిపారు. కానీ బండారి లేఅవుట్‌కు వచ్చే సరికి స్థానిక వాటర్ వర్క్స్ ఆఫీస్ నుంచి బండారి లేఅవుట్‌కి మంచినీటి సరఫరా చేసే పైప్‌లైన్ ఉందని గ్రహించిన కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే నిలిపివేశారని పేర్కొన్నారు. ఆ తరువాత పనులు పూర్తి కాకుండానే కార్పొరేషన్ అధికారులు సంబంధిత కాంట్రాక్టర్‌కి బిల్లులను కూడా మంజూరు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ అధికారుల పొరపాటు వల్ల ప్రజాధనం వృథా కావడమే కాకుండా ప్రజలు ఐదు నెలల నుంచి అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సదరు కాంట్రాక్టర్ నుంచి డబ్బులను వెంటనే రికవరీ చేయాలని ఆయన పేర్కొన్నారు.

అనుమతులు లేకుండా షెడ్డు నిర్మాణం

చోద్యం చూస్తున్న అధికారులు



చింతల్: చింతల్ డివిజన్ పరిధిలోని వైఎంఎస్ కాలనీలో ఉన్న ఎంపీఏఆర్ పరిశ్రమకు సంబంధించిన స్థలం ఉంది. సుమారు 1500 -2000 గజాల లోపు ఉన్న ఈ స్థలానికి ఎటువంటి అనుమతులు లేకుండా సదరు పరిశ్రమ యాజమాన్యం అక్రమ షెడ్డు నిర్మాణం చేపట్టింది. దీనిపై జీహెచ్‌ఎంసీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగానే గండి పడిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సామాన్యుడు చిన్న నిర్మాణం చేపట్టినా, ఇళ్ల ముందు కనీసం మెట్లు నిర్మించుకున్నా తమకు సమాచారం ఇవ్వలేదని తట్టా పారా గుంజుకునే అధికారులు.. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే నిర్మాణాలపై చర్యలు తీసుకోకపోవడం ఎంత వరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు.

'స్వచ్ఛత' ఎక్కడ నీ చిరునామా..!



కుత్బుల్లాపూర్: సర్కిల్ పరిధిలోని వాణి నగర్ నుంచి చింతల్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో స్వచ్ఛత కరువైంది. రోజుల తరబడి చెత్తాచెదారం తొలగించకపోవడంతో అటువైపు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ప్రతిరోజు చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

మురుగు పరుగు.. జనం బేజారు



కుత్బుల్లాపూర్: అయోధ్య నగర్ నుంచి సుభాష్ నగర్ శివాలయం మీదుగా వెళ్లే రోడ్డులో గత వారం రోజులుగా డ్రైనేజీ పొంగి పొర్లుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ విషయంపై ఇటీవల ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా ఒక్క అధికారి స్పందించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు తక్షణమే రోడ్డుపై పారుతున్న డ్రైనేజీ విషయంపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చేందుకు అధికారుల యత్నం

• తమకు కోర్టు ఆర్డర్ కాపీ ఉందని అడ్డుకున్న స్థానికులు • వెనుదిరిగిన గిరిజన సంక్షేమ అధికారులు



ఘటన స్థలంలో అధికారులు, పోలీసులు

దుండిగల్: ప్రభుత్వ స్థలంలో వెలిసిన నిర్మాణాలను కూల్చివేసేందుకు వచ్చిన అధికారులను గురువారం స్థానికులు అడ్డుకున్నారు. దీంతో కొద్ది సేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసుల జోక్యంతో స్థానికులు శాంతించారు. గండిమైసమ్మ–దుండిగల్ మండల పరిధి డి.పోచంపల్లిలోని సర్వే నంబర్ 120/11లో 2016లో అప్పటి ప్రభుత్వం 2.25 ఎకరాల స్థలాన్ని గిరిజన సంక్షేమ శాఖకు కేటాయించింది. అప్పటి నుంచి సదరు స్థలం వారి ఆధీనంలోనే ఉంది. కాగా ఇటీవల సదరు స్థలంలో నిర్మాణాలను చేపడుతున్నారని గిరిజన శాఖ అధికారులకు ఫిర్యాదులు వచ్చాయి. వెంటనే ఆ శాఖ జిల్లా అధికారి వినోద్ నేతృత్వంలో మండల డిప్యూటీ తహసీల్దార్ అవినాశ్, రెవెన్యూ అధికారి రవికుమార్, సర్వేయర్ రూప గురువారం అక్కడికి చేరుకున్నారు. పోలీసుల బందోబస్తు మధ్య జేసీబీతో నిర్మాణాలను కూల్చి వేసేందుకు ప్రయత్నించారు. స్థానికులు భారీగా చేరుకుని ఆందోళన చేపట్టడంతో కొద్ది సేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తాము గతంలోనే గ్రామ పంచాయతీ లేఅవుట్ ఆధారంగా డబ్బులు పెట్టి ప్లాట్లను కొనుగోలు చేశామని, తమ కోర్టు నుంచి ఆర్డర్ కాపీలు సైతం వచ్చాయని, ఇప్పుడు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఎలా కూల్చివేస్తారని స్థానికులు ఎదురుతిరిగారు. దీంతో సంబంధిత అధికారులు వెనుదిరిగారు. కాగా గిరిజన శాఖకు కేటాయించిన 2.25 ఎకరాల స్థలానికి సంబంధించిన సరిహద్దులను గిరిజన శాఖ అధికారులకు మండల రెవెన్యూ అధికారులు చూపించారు. 120/11లో ఆరు అక్రమ నిర్మాణాలు ఉన్నట్లు గుర్తించారు. గతంలో ఇక్కడ నిర్మాణాలను చేపట్టిన సమయంలో కూల్చివేతలు చేపట్టామని, 2016లోనే గిరిజన శాఖకు భూమిని కేటాయించారని, వారే సదరు స్థలాన్ని కాపాడుకోవాలని తహసీల్దార్ సయ్యద్ మతిన్ తెలిపారు.